## నగరం గజగజ..

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ఈశాన్య దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతున్నాయి. దీంతో చలిపులి పంజా విసురుతున్నది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.6, కనిష్ఠం 15.2 డిగ్రీలు, గాలిలో తేమ 36 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, రాజేంద్రనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 10.5 డిగ్రీలుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.




నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 6 జనవరి 2025 | HYDERABAD




చిలుకానగర్‌లో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలను తింటున్న జంతువులు

# అడ్డగోలు నిర్మాణాలు

## అధికారుల అండతో..

ఆదిలోనే కట్టడి చేయడంలో ప్లానింగ్ విభాగం విఫలం

కంటి తుడుపు చర్యగా నోటీసులు, క్రిమినల్ కేసులు

ప్లానింగ్‌కు సవాల్‌గా వసంత్‌నగర్ కాలనీ అక్రమ నిర్మాణాలు

సిటీబ్యూరో/ కేపీహెచ్‌బీ కాలనీ: జీహెచ్‌ఎంసీలో అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయడంలో యంత్రాంగం విఫలమవుతున్నది. కొందరి అధికారుల అండతో అక్రమార్కులు రెచ్చిపోతుండటంతో పుట్టగొడుగుల్లా నిర్మాణాలు వెలుస్తున్నాయి. అనుమతి కోసం వచ్చే దరఖాస్తులను వేర్వేరు కారణాలతో తొక్కి పెట్టడం, భయాందోళనకు గురయ్యే యజమానుల నుంచి ముడుపులు తీసుకోవడం కొందరికీ అలవాటుగా మారింది. చైన్‌మెన్ల నుంచి న్యాక్ ఇంజినీర్లు, టీపీఎస్‌లు, ప్లానింగ్ ఉన్నతాధికారుల వరకు కొందరు అక్రమ సంపాదన మత్తులో తూగుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు.

### ఫిర్యాదులపై డోంట్‌కేర్ ...

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని వసంత నగర్ కాలనీ 1989 లో 964 ప్లాట్లతో ఏర్పడింది. ఇటీవల ప్లాట్ నంబర్ 520, 263,213/A, 710 ప్లాట్ల తోపాటు మరికొన్ని చోట్ల జీహెచ్‌ఎంసీ నిబంధనలను అతిక్రమించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ అంశంపై వసంత నగర్ సొసైటీ సమావేశంలో ఆయా బిల్డర్లను పిలిచి నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేయొద్దని కోరారు. అయినా వారు నిర్మాణ పనులు కొనసాగించడంతో ఏప్రిల్ 4న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జూన్ 7న బల్దియా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, జూన్ 14న ఆ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి... జూలై 7న ఆ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేశారు. మళ్లీ నిర్మాణ పనులు కొనసాగించడంతో ఫిర్యాదు చేయగా డిసెంబర్ 19న ప్లాట్ నంబర్ 520, 263, 213/A, 710లలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాలను సీజ్ చేశారు. మరుసటి రోజు ఆ సీజ్‌ను తొలగించి పనులు కొనసాగించడంతో మూసాపేట ఉప కమిషనర్ కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయినా ప్లాట్ నంబర్ 520, 263లలో పనులను మళ్లీ మొదలుపెట్టి కొసాగిస్తున్నారు.

### క్రిమినల్ కేసులు నమోదు చేశాం...

వసంతనగర్ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న బిల్డింగ్‌కు నోటీసులు జారీచేసి తదనంతరం సీజ్ చేశాం. అయినా పనులు కొనసాగుతూ ఉండడంతో కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశాం. అయినా బిల్డర్లు భయపడకుండా మళ్లీ బిల్డింగ్ పనులు చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులొచ్చాయి. ..సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. – వంశీకృష్ణ, డిప్యూటీ కమిషనర్ మూసాపేట సర్కిల్

### క్రిమినల్ కేసులు నమోదైనా..

మూసాపేట సర్కిల్ లో అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదైనా... ఆ నిర్మాణదారులు యధేచ్ఛగా నిర్మాణ పనులను కొనసాగిస్తూ అధికారులకు సవాల్ విసిరుతున్నారు. నిబంధనలను అతిక్రమిస్తూ నిర్మాణ పనులు చేపడితే ఆదిలోనే గుర్తించి వాటిని అడ్డుకట్ట వేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు.. అందిన కాడికి పుచ్చుకొని చూసీ చూడనట్లు వదిలేశారు. ఈ వ్యవహారంపై వసంత నగర్ సొసైటీ సభ్యులు అనేకసార్లు ఫిర్యాదు చేసినా.. తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని నిర్మాణదారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని ఆ నిర్మాణాలను పూర్తి చేసేలా సహకరించారు. అయినా పట్టు విడవకుండా సొసైటీ నుంచి ఫిర్యాదులు రావడంతో ఇక తప్పదు అన్నట్లు నిర్మాణదారులకు నోటీసు జారీ ఆ నిర్మాణాలను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ నిర్మాణదారులు సీజ్‌ను తొలగించి మళ్లీ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. సొసైటీ నుంచి మళ్లీ ఫిర్యాదులు అందడంతో ఆ నిర్మాణదారులపై కేపీహెచ్‌బీకాలనీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసులు నమోదయ్యాయి. కానీ అక్రమ భవన నిర్మాణాలు చేస్తున్న వారు బిల్డింగ్ సీజ్ చేసినా.. వారిపై కేసులు నమోదైనా భయం లేకుండా మళ్లీ పనులు కొనసాగిస్తున్నారు. 'మా స్థలంలో మేము ఎన్ని అంతస్తులైనా కట్టుకుంటాం... కేసులు నమోదు చేసినా.. వాటిని ఎదుర్కొంటాం.. కానీ నిర్మాణ పనులను ఆపబోం' అని తేల్చి చెబుతుండడం గమనార్హం.



### అడ్డుకట్ట వేసేది ఎవరు..?

మూసాపేట సర్కిల్ పరిధిలో పలు కాలనీల్లో బల్దియా నిబంధనలను అతిక్రమిస్తూ భవన నిర్మాణ పనులు సాగుతున్న టౌన్ ప్లానింగ్ యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఆదిలోని నిర్మాణాలను గుర్తించి సమాచారం ఇవ్వాల్సిన న్యాక్ ఇంజినీర్లు సరిగా పనిచేయడం లేదు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో కొనసాగే స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం కూడా ఈ నిర్మాణాలను అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నది. ఆదిలోనే అక్రమ నిర్మాణా లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు... కోర్టు నుంచి కొత్త ఉత్తర్వులు రావాలని అప్పుడే ఆ నిర్మాణాలను కూల్చివేస్తామని కాలయాపన చేస్తుండడం అక్రమ నిర్మాణదారులకు వరంగా మారింది. అక్కడ నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తూ... సీజ్ చేస్తున్నారే తప్ప.. ఆ నిర్మాణాలు కొనసాగుతున్న వాటిని కూల్చి వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఎవరైనా ఆ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తే నోటీసులు ఇచ్చామని సీజ్ చేస్తామని చెబుతూ... రెండు రిబ్బన్లు కట్టి జారుకుంటున్నారు. మరునాడే జీహెచ్ఎంసీ సీజ్‌ను తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అయినప్పటికీ ఆ నిర్మాణదారులు పనులను ఆపకుండా ఈ చర్యలన్నీ మామూలేనని భావిస్తూ యధావిధిగా నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు.



చెంగిచెర్లలో అక్రమ నిర్మాణాలు

## రాత్రికి రాత్రే..

### వివాదాస్పద స్థలాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు

### చోద్యం చూస్తున్న అధికారులు

మేడ్చల్: వివాదాస్పద స్థలాల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. రాత్రికి రాత్రే షెడ్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెంగిచెర్లలో ఉన్న 34,35,36 సర్వే నంబర్ల భూమి హైకోర్టులో స్టేటస్ కో ఆర్డర్ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇరువురి మధ్య భూమికి సంబంధించిన కేసు కోర్టులో ఉన్నా.. రాజకీయ అండదండలతో అనుమతులు లేకుండా నిర్మాణాలు నిర్మిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాల విషయమై బోడుప్పల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. బోడుప్పల్‌కు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల అండదండల వల్ల యధేచ్ఛగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు వంటివి అనేకం జరుగుతున్నా.. కాంగ్రెస్ నాయకులు చెప్పిందే వేదంగా అధికారులు నడుచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కోర్టు కేసులో ఉన్న వివాదాస్పద భూమిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. బోడుప్పల్ మున్సిపల్ పరిధిలో అనుమతులు లేని నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జా చేస్తే నిబంధనల మేరకు చర్యలు చేపడుతాం. చెంగిచెర్లలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై త్వరలోనే చర్యలు ఉంటాయి.
– రాంలింగం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

# రియల్ ఎస్టేట్‌పై హైడ్రా ఎఫెక్ట్

సైబర్‌సిటీపై ప్రభావం

### కొత్త ఇండ్ల నిర్మాణాలు లేక.. తగ్గిన ఎల్ టీఎం విద్యుత్ కనెక్షన్లు

సిటీబ్యూరో: ఐటీ కారిడార్ కేంద్రమైన సైబర్‌సిటీపై హైడ్రా ఎఫెక్ట్ పడింది. అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాలంటూ హైడ్రా కూల్చివేతలతో దడ పుట్టించడంతో సైబర్ సిటీతో పాటు ఎక్కడైతే చెరువులు తదితర జల వనరులు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా హైడ్రా వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ మందగించింది. దీంతో కొత్త నిర్మాణాలే లేకుండా పోయాయి. ఒకవేళ కొన్ని చోట్ల నిర్మాణాలు మొదలుపెట్టినా హైడ్రా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న భయంతో కొనుగోలుదారులు అటువైపు చూడడమే లేదని తెలుస్తున్నది. దీంతో కొత్త ఎల్‌టీఎం కనెక్షన్లు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి. 2024 నవంబర్ వరకు ఉన్న గణాంకాలను 2023తో పోల్చి చూస్తే గ్రేటర్‌లోని మొత్తం పది సర్కిళ్లలో ఎల్‌టీఎం కనెక్షన్ల సంఖ్య స్వల్పంగా పెరిగినప్పటికీ.. అందులో ఐదింటిలో తగ్గాయి. బంజారాహిల్స్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, సైబర్‌సిటీలో తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్, మేడ్చల్, సంగారెడ్డిలలో పెరుగుదల కనిపిస్తున్నది. నాలుగు మీటర్లు దాటితే లో టెన్షన్ మల్టీపుల్ మీటర్లు(ఎల్‌టీఎం)కింద టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ కనెక్షన్లు జారీ చేస్తుంది. ప్యానల్ బోర్డు ఏర్పాటు చేసి మీటర్లు బిగిస్తుంది. ఈ కనెక్షన్లు 2023లో 12,263 జారీ అవ్వగా, 2024లో 12,537 జారీ అయ్యాయి.

### హైడ్రానే కారణం..

సిటీ రియాల్టీ 2024లో స్తబ్దుగా ఉండడానికి హైడ్రా ప్రధాన కారణంగా రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు. జూలై వరకు ఎన్నికల మూడ్‌లో ఉన్న నేపథ్యంలో ఒక్కసారిగా హైడ్రా వచ్చి రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం చూపిందని వారంటున్నారు. ప్రధానంగా హైడ్రా చెరువుల ఆక్రమణలంటూ కూల్చివేతలలో దూకుడుగా వ్యవహరించిన క్రమంలో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఈ క్రమంలో కొత్తగా కొనుగోలుదారులు రాకపోవడం, నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడం, కొత్త నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మరోవైపు జీడీపీ వృద్ధి రేటు కూడా సుమారుగా 3 శాతానికి తగ్గింది. దీంతో కొత్త ఇండ్ల నిర్మాణాలు తగ్గిపోయి మీటర్ కనెక్షన్లు తీసుకోలేదని తెలుస్తున్నది. 2022 డిసెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు బంజారాహిల్స్‌లో 225 ఎల్‌టీఎం కనెక్షన్లు ఉంటే 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు 161 ఉన్నాయి. అదే క్రమంలో రాజేంద్రనగర్‌లో 924 ఉంటే 916 ఉండగా, సైబర్‌సిటీలో1638 ఉంటే 1552 ఉన్నాయి. సరూర్‌నగర్‌లో 2132 ఉంటే 1965కు తగ్గాయి.

### ఎల్ టీఎం కనెక్షన్ల సంఖ్య:



| సర్కిళ్లు | 2022 డిసెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు | 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు |
|---|---|---|
| సైబర్ సిటీ | 1638 | 1552 |
| బంజారాహిల్స్ | 225 | 161 |
| సెంట్రల్ | 723 | 743 |
| సౌత్ | 845 | 872 |
| మేడ్చల్ | 2040 | 2399 |
| రాజేంద్రనగర్ | 924 | 916 |
| సరూర్‌నగర్ | 2132 | 1985 |
| సికింద్రాబాద్ | 695 | 700 |
| సంగారెడ్డి | 1366 | 1639 |

# మరో ఎస్ఆర్‌డీపీ ఫలం

## నేడు ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్ ప్రారంభం

రూ.799.74 కోట్లతో వంతెన నిర్మాణం

విమానాశ్రయానికి సాఫీగా సాగనున్న ప్రయాణం

కేసీఆర్ ప్రభుత్వంలో రూ..5937 కోట్లతో ఎస్ఆర్‌డీపీకి శ్రీకారం

ఎస్ఆర్‌డీపీ ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి...

42 ప్రాజెక్టుల్లో 37 ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీర్చిన బల్దియా

ఇప్పటికే అందుబాటులోకి 22 ఫ్లై ఓవర్లు, 14 ఆర్వోబీ, ఆర్‌యూబీ

ఈ ఏడాది చివరి నాటికల్లా మరో ఐదు ప్రాజెక్టులు

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ ) : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి..హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.5937కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ 42 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ శాఖ ఐదు చోట్ల ఫ్లై ఓవర్లు చేపట్టింది. ట్రాఫిక్, వాహన రద్దీ ఉపశమనానికి ఎస్ఆర్‌డీపీ దోహదపడుతున్నది. ప్రయాణ వేగాన్ని పెంచడం, సమయాన్ని తగ్గించడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడం, అంతేకాకుండా కనిష్ఠ భూ సేకరణ నిధుల ఆధారంగా ఎస్ఆర్‌డీపీకి ప్రాధాన్యత ఇచ్చారు. 42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు.. తాజాగా రూ.799.74కోట్లతో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన అతి పొడవైన ఫ్లై ఓవర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జూపార్కు ఫ్లై ఓవర్ 23వ ఫ్లై ఓవర్ కాగా, ఇప్పటికే 14 చోట్ల ఆర్వోబీ, ఆర్‌యూబీలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన ఐదు చోట్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా ఎస్ఆర్‌డీపీ పూర్తి ఫలాలు అందుబాటులోకి తేస్తామని అధికారులు తెలిపారు.



పురోగతిలో ఉన్న ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు ఇవే

| ప్రాజెక్టు | శాస్త్రీపురం ఆర్వోబీ | ఫలక్‌నుమా ఆర్వోబీ | శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ (స్టేజీ-2) | నల్గొండ క్రాస్‌రోడ్ నుంచి ఓవైసీ హాస్పిటల్ జంక్షన్ నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ | ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ |
|---|---|---|---|---|---|
| నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో) | 71 | 47.10 | 275 | 370 | 311 |

### ఎట్టకేలకు ప్రారంభం..

ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి రావాల్సిన జూపార్కు –ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు అలుముకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య నెల కొన్న గ్యాప్‌తో ఈ ఫ్లై ఓవర్ వాహనదారులకు అందుబాటులోకి ఇంతకాలం తీసుకురాలేదన్న చర్చ అటు జీహెచ్‌ఎంసీ అధికార వర్గాలు, ఇటు పాలక మండల సభ్యుల్లో జరిగింది. వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన–ప్రజా విజయోత్సవ సంబురాల్లో పురపాలకకు సంబంధించిన ఈ నెల 3న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపాలని నిర్ణయించి కొన్నింటిని ప్రారంభించారు. అయితే షెడ్యూల్ ప్రకారం వర్చువల్ విధానంలో జూపార్కు–ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభం ఉన్నదని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. కానీ ఆ రోజు కుదరలేదని చెబుతూ వాయిదా వేశారు. ఆ తర్వాత 5ఐదవ తేదీ, 8వ తేదీ అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. చివరకు 9న ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ నాలుగు దఫాలుగా వాయిదా వేస్తూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభిస్తుండడం గమనార్హం.

### పాతనగరానికి మహా రిలీఫ్

పాతనగరంలో ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణ గుట్ట ఫ్లై ఓవర్ అందుబాటులోకి తీసుకురాగా..ఆరాంఘర్–జూపార్కు ఫ్లై ఓవర్‌తో శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనున్నది. ఆరాంఘర్, శాస్త్రిపురం, కలాపత్తర్, దారుల్ ఉల్ం, శివరాంపల్లి, హసన్‌నగర్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత ఉపశమనం లభించనున్నది. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రవాణా మెరుగుపరచడమే కాకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థకు దోహద పడనున్నది. కాగా, భూ సేకరణలో నెలకొన్న జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు, ర్యాంపులు ఆలస్యం కానున్నది.

### ప్రాజెక్టు విశేషాలు

- ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు 4.08 కిలోమీటర్ల మేర అతి పొడవైన ఫ్లై ఓవర్
- ప్రాజెక్టు వ్యయం రూ. 799.74కోట్లు
- 280 మీటర్ల మేరలో రెండు ర్యాంపులు (ఆరాంఘర్ వైపు 184 మీటర్లు, జూపార్కు వైపు 95 మీటర్లు)
- ఆరు లేన్లతో ఇరువైపులా మూడు లేన్లతో నిర్మాణం.
- ఫ్లై ఓవర్ పొడవునా ఎల్ఈడీ లైటింగ్
- రాబోయే 20 ఏండ్ల ట్రాఫిక్ దృష్ట్యా ఫ్లై ఓవర్ నిర్మాణం.